# ఓ.టీ.


..అంటే ఏ హోటల్లోనో, కాంటీన్‌లోనో ఒక 'టీ' అని సర్వర్ కిచ్చే ఆర్డరు కాదు.

'ఓవర్ టైమ్!'

ఈ పదానికి మన దేశంలో ముక్తసరి పదం లేదు. వివరంగా చెప్పుకోవల్సిందే. నిర్ణీతమైన, లేదా నిర్ధారితమైన కార్యనిర్వహణా సమయానికి యిరువైపులా పనిచేయడం అని చెప్పుకోవాలి. యిది వాస్తవానికి నిర్ధారితమైన పనికన్నా అధికమైన పని చేసినందుకు వర్తించాలి. కాని దీనికి మన దేశంలో కొత్త భాష్యం చెప్పుకోవాలి. కాలహరణం గావించి, కాలజాప్యం చేసి నిర్ణీతమైన సమయంలో చేయవలసిన పనిని హద్దులు దాటి పూర్తి చేసి అదనపు ఆదాయం సమకూర్చుకోవడం. కేవలం సంతకాలు పెట్టడానికే జీతాలనీ, 'రోటీ' కోసం ఓ.టీ. అనీ వెన్ను విరుచుకొని సమాధానం చెప్పేవాళ్ళు చాలామంది ఉన్నారు.

రాజశేఖరం ఉదయం తన ఆఫీసు గదిలో కూర్చున్నాడో లేదో, బల్ల మీది టెలిఫోన్ మ్రోగింది. అవతల పక్క నుంచి జనరల్ మేనేజర్ 'సక్సేనా' పలకరించాడు.

"గుడ్ మార్నింగ్, రాజశేఖర్! 'సైట్'లో మూడో నెంబరు కంప్రెసర్' పని చెయ్యడం మానేసిందట. ఈ ఉదయం మార్నింగ్ ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో చూశాను. సెంట్రల్ వర్క్ షాప్ వాళ్ళు మన వద్ద నుంచి లక్ష రూపాయలు శాంక్షన్ తీసుకొని, దాన్నీ మధ్యనే బాగుచేయించిన సంగతి నీకూ తెలుసు. ఈ విషయాన్ని వెంటనే తెలియజెప్పకపోతే తప్పంతా మన ఫీల్డ్ యూనిట్ మీద రుద్దిపారేస్తారు! నువ్వు వెంటనే సైట్‌కి వెళ్ళి, వివరాలు తెలుసుకొనిరా. రేపు జరిగే పదకొండు గంటల 'టెక్నికల్ రివ్యూ మీటింగ్‌లో ఏకి పారేస్తాను. మరో విషయం, నిన్న రాత్రి షిఫ్ట్ రెండు గంటలు ఆలస్యంగా చేరిందట. అందువల్ల సైట్‌లో ఉన్న మధ్యాహ్నం షిఫ్ట్ వాళ్ళకి రెండేసి గంటలు ఓ.టీ. యివ్వాల్సి వచ్చిందని



'షిఫ్ట్ ఇన్‌ఛార్జ్' టెలిఫోన్ చేశాడని డి.జి.ఎమ్. నాకు టెలిఫోన్ చేసి చెప్పాడు. ఆ విషయమై కూడా వివరాలు తెలుసుకొనిరా. రేపు మీటింగ్‌లో ట్రాన్స్‌పోర్ట్ సెక్షన్ భరతం పడతాను! ఈ సాయంత్రానికల్లా ఈ రెండు వ్యవహారాల విషయమై నాకు వివరాలందాలి."

రాజశేఖర్ సమాధానం చెప్పకముందే ఫోన్ క్లిక్‌మంది. వెంటనే స్టెనోని యింటర్‌కాంలో సంబోధిస్తూ, "స్టెల్లా! ట్రాన్స్‌పోర్ట్ కంట్రోల్ రూంకి ఫోన్ చేసి, డ్రైవర్ చంపక్‌లాల్ కనక వస్తే, వెంటనే జీప్‌ని తీసుకు రమ్మని చెప్పు. వెంటనే సైట్‌కి వెళ్ళాలి" అని ఆదేశమిచ్చాడు.

ఓ పది నిముషాల తర్వాత స్టెనో, "జీప్ డ్రైవర్ చంపక్‌లాల్ మీతో మాట్లాడడానికి వచ్చాడు. ఏదో చెప్పాలట," అని చెప్పగానే, "లోపలికి పంపు" అన్నాడు రాజశేఖరం.

చంపక్‌లాల్ రాజశేఖరం గదిలో అడుగుపెట్టోనే, "నమస్తే శేఖర్ సాబ్! సైట్ వెళ్ళాలన్నార్ట కదా? జీప్‌కి హెడ్‌లైట్లు వెలగటల్లేదు!" అన్నాడు.

"బ్రేక్‌లైట్లు పన్జేస్తున్నాయా?" రాజశేఖరం ప్రశ్నించాడు.

"అవి పన్జేస్తున్నాయండి."

"మరింకేం? మూడింటికల్లా తిరిగి వచ్చేసేదే కదా. పగలప్పుడు హెడ్‌లైట్లు వెలగకపోతే కొంపేమీ మునిగిపోదు!"

"సార్, వెళ్ళడమంటే మీ చేతుల్లో ఉందికాని, తిరిగి రావడం మీ చేతుల్లో ఉండదని అందరికీ తెలుసు. సైట్ గొడవల్లో మీరు టైం మర్చిపోతారు. అదీకాక, రానూ పోనూ

కలిపి దాదాపు నూట అరవై కిలోమీటర్లు ప్రయాణం చెయ్యాలి. మన బండి ఏదైనా ట్రబుల్ యిచ్చినా, లేదా హైవే మీద ట్రాఫిక్ జామ్ అయినా, ఆలస్యమైపోయి చీకటి పడిపోయిందనుకోండి - బండి నడపడం నా సాధ్యం కాదు. ఏదైనా జరిగితే తప్పంతా నా మీద రుద్దేస్తారు!"

"ఆటో వర్క్‌షాప్‌లో బాగుచెయ్యడానికి యివ్వవలసింది!"

"ఏది సార్! నిన్న సాయంత్రం మన జీప్‌ని సెక్యూరిటీ సెక్షన్ తీసుకువెళ్ళిందిట. రాత్రి పన్నెండింటికి తీసుకువచ్చి, హెడ్‌లైట్లు వెలగటల్లేదని కంట్రోల్ రూంలో చెప్పి వెళ్ళిపోయాడట. నేనిప్పుడే కదా, డ్యూటీలోకి వస్తి! ఆటో సెక్షన్‌లో రిపేర్ చేయించి తీసుకువస్తాను."

"అటువంటప్పుడు కంట్రోల్ రూం వాళ్ళు మరో బండి పంపవచ్చుగా?" - రాజశేఖర్ గొంతులో కాస్త విసుగు ధ్వనించింది.

"ఉదయమే జనరల్ పూల్‌లో ఉన్న రెండు జీప్‌ల్ని యిద్దరు సి.ఇ.లు తీసుకుపోయార్ట. మూడో బండిని నిన్న సాయంత్రం తీసుకువచ్చిన డ్రైవర్ పార్క్ చేసి, బండి తాళం తీసుకుపోయాడట! తను నడుపుతోన్న బండిని మరొహాళ్ళు నడపడానికి ఆ డ్రైవర్ కాని, తనకి ఎలాట్ చేసిన బండిని మరొహారికివ్వడానికి ఆ డి.జి.ఎం.గారికి కాని యిష్టం లేదు సార్! అసలు మీరు కూడా మీ డ్యూటీకి ఎలాట్ చేసిన బండిని మరొహారికివ్వరాదని కంట్రోల్ రూం వాళ్ళకి గట్టిగా చెప్పండి సార్!"

రాజశేఖరానికి సహనం సన్నగిల్లసాగింది. "సరే, త్వరగా వెళ్ళి ఆటో వర్క్‌షాపులో రిపేర్ చేయించి తీసుకురా" అన్నాడు మరింత విసుగ్గా.

చంపక్‌లాల్ వెళ్ళగానే, మరో వారంలో రాబోయే పార్లమెంటరీ డెలిగేషన్‌కి యివ్వవలసిన సమాచారం తాలూకు 'డ్రాఫ్ట్ రిపోర్ట్'ని ముందర పడవేసుకొని మార్పులూ, చేర్పులూ చేయసాగాడు. మధ్యాహ్నం రెండయేసరికి స్టెనో స్టెల్లా కంట్రోల్ రూంకీ, ఆటోవర్క్ షాప్‌కీ నాలుగైదుసార్లు ఫోన్ చేసింది బండి విషయమై.

రెండున్నరకి చంపక్‌లాల్ చెమటలు కార్చుకొంటూ వచ్చాడు.

"ఆటో వర్క్‌షాప్ వాళ్ళు మన బండిని క్యూలో పెట్టేశారు సార్! మధ్యాహ్నం షిఫ్ట్ ఫోర్‌మన్ నాకు బాగా తెలిసినవాడు. సివిల్ ఇంజనీరింగ్ వాళ్ళ బండేదో రిపేరై సిద్ధంగా ఉంది. దాన్ని నా కిచ్చి పంపాడు, పదండి సార్!" అన్నాడు.

బ్రేక్‌లు సరిగా పనిచేయకపోవడం వల్లా, ఒకటే హెడ్‌లైట్ వెలుగుతుండడం వల్లా, రేడియేటర్ సరిగా పనిచెయ్యక ఇంజన్ వేడెక్కిపోతూండడం వల్లా, రాజశేఖరం సైట్‌కి వెళ్ళి తిరిగి వచ్చేసరికి రాత్రి పన్నెండు దాటింది. దారి పొడుగునా చంపక్‌లాల్ ఆటోవర్క్ షాప్ వాళ్ళ నిర్లక్ష్య ధోరణి గురించీ, తన ఫోర్‌మన్ స్నేహితుడు చేసిన దగా గురించీ

తిడ్తూనే ఉన్నాడు.

"సార్! యింటి దగ్గర దింపేస్తాను!" అన్నాడు ఆఫీసు చేరిన తర్వాత.

"ఆఫీసులో స్కూటరుండిపోయింది. రేపు ఆఫీసుకి రావడం మళ్ళీ కష్టమవుతుంది. లాగ్‌బుక్కివ్వు, సంతకం చేస్తాను" అన్నాడు రాజశేఖరం.

ఆ రోజు డ్యూటీలో చంపక్‌లాల్ ఖాతాకి ఏడు గంటల ఓ.టీ. జమ అయింది.

తలుపు తీస్తూనే రాజశేఖర్ శ్రీమతి అనసూయ, "యింత ఆలస్యమైపోయింది. ఏదైనా మీటింగా? రెండు మూడు సార్లు మీ గదికి ఫోన్ చేశాను, సమాధానం లేదు" అంది.

"అనుకోకుండా ఫీల్డ్‌కి వెళ్ళాల్సి వచ్చింది. వెళ్ళే ముందర నీకు కబురు చేసి ఉండాల్సింది. మరిచిపోయాను. నిత్యం వచ్చే జీప్ రిపేర్‌కి వెళ్ళడం వల్ల మరోటి యిచ్చారు. అది అధ్వాన్నంగా ఉండడం వల్ల ఆలస్యమైపోయింది." అన్నాడు రాజశేఖరం స్కూటర్ని లాక్ చేస్తూ.

"మీ చాదస్తం కాని, మీ 7050 జీప్‌ని జి.ఎమ్. భార్యామణిగారు ఈ ఉదయం పదకొండింటికి ఎక్కడికో తీసుకుపోయి, సాయంత్రం ఆరింటికి తిరిగి వచ్చింది! ఆ బండిని చంపక్‌లాల్ కాక మరెవరో నడుపుతున్నారు" అంది అనసూయ.

"సరేలే, ఈ విషయాన్ని వాళ్ళ దగ్గరా, వీళ్ళ దగ్గరా అని లేనిపోని గొడవలు తెచ్చుకోకు!"

"అందరూ యిష్టం వచ్చినట్టు ఆఫీసు వాహనాలు ఉపయోగించుకుంటూంటే, మీరొక్కరే మడికట్టుకొని కూర్చున్నారు!" అంది అనసూయ మూతి వంకర్లు తిప్పుతూ. అనసూయ దృష్టిలో విలువలనేవి పిరికివాళ్ళ లక్షణాలు.

వాదనలోకి దిగడం యిష్టం లేక రాజశేఖరం మౌనంగా ఉండిపోయాడు.

ఆ మర్నాడుదయం ఆఫీసు చేరగానే రాజశేఖరం జి.ఎమ్. గదికి దారితీశాడు.

"నిన్న సాయంత్రం నీ కోసం ఎదురు చూశాను. రావడం ఆలస్యమైందా?" అని జి.ఎం. ప్రశ్నించాడు రాజశేఖరాన్ని చూస్తూనే.

"రావడం కాదు, అసలు వెళ్ళడమే ఆలస్యమైంది! నా బండిని ఎవరి డ్యూటీలోనో పంపి మధ్యాహ్నం రెండు తర్వాత ఏదో డొక్కు జీప్ యిచ్చి పంపారు!" అన్నాడు రాజశేఖరం కూర్చుంటూ.

"సరేలే, యివన్నీ రోజూ ఉండే గొడవలే! ముందు కంప్రెసర్ సంగతి చెప్పు" అన్నాడు జి.ఎమ్. మాట మారుస్తూ.

రాజశేఖరం వివరాలు చెబుతుండగా, డివిజన్ ఫైనాన్స్ ఆఫీసరు ముఖర్జీ గదిలో అడుగు పెట్టాడు. ఓ కుర్చీ కాస్త జరిపి కూర్చుని, "సక్సేనా సాబ్! హెడ్ క్వార్టర్స్ నుంచి బోనస్ విషయమై నిన్న సాయంత్రం మెసేజ్ వచ్చిన సంగతి మీకు తెలుసు కదా? దీపావళి యింక సరిగ్గా నాలుగు రోజులుంది. సకాలంలో బోనస్‌లు యివ్వకపోతే యూనియన్

వాళ్ళు గొడవ చేస్తారు. అవతలి ఎల్లుండిలోగా బిల్స్ తయారుచేసి పేమెంట్ చెయ్యాలి. అందుకని..” – మాట పూర్తి చెయ్యకుండా లౌక్యంగా ఆపివేశాడు.

“..... ఓ.టీ. శాంక్షన్ కావాలంటారు?! అంతేకదా! ఎంత మందికి? ఎన్ని గంటలు?” – జి.ఎమ్. సక్సేనా ముఖర్జీ యిబ్బందిని తొలగిస్తూ అన్నాడు.

“మొత్తం పది మందికి. రోజుకి ఒకరికి అయిదు గంటల చొప్పున మొత్తం రెండు రోజులకి వంద గంటలు” అన్నాడు ముఖర్జీ తను తీసుకొచ్చిన ఫైల్‌ని ముందుకు జరుపుతూ.

పది మంది ఓ.టీ.ని గురించి ఈరోజు కనక ప్రశ్నిస్తే, రేపు వెయ్యి మంది బోనస్ సమయానికందలేదని గొడవ చేస్తారు. సకాలంలో బోనస్ యివ్వడమనేది మేనేజర్ల సమర్థతకి ఓ నిదర్శనం. అందుకనే సక్సేనా మారు మాట్లాడకుండా ఫైల్లో సంతకం పెట్టి ముఖర్జీని పంపివేశాడు.

“పధ్నాలుగు శాతం బోనస్ యిస్తున్నట్టు ఫోన్ ద్వారా హెడ్ క్వార్టర్స్ ఫైనాన్స్ మన ఫైనాన్స్‌కి తెలియజేసి పదిరోజులకిపైగా అయింది. బోనస్ బిల్స్ వీళ్ళు కంప్యూటర్ సహాయంతో చేసి వారానికి పైగా అయింది. మీకు తెలుసో, తెలియదోకాని ఆ పనంతా వీళ్ళు ఆఫీసు టైంలోనే నాలుగ్గంటల్లో చేసి కూర్చున్నారు!” అన్నాడు రాజశేఖరం.

“నాకు తెలియదని కాదు, పూర్తిగా తెలుసు! ‘ఫీల్డ్ వాళ్ళకి ముందస్తు శాంక్షన్ లేకుండా ఎడాపెడా ఓ.టీ.లు అనుమతిస్తున్నారు. అందుచేత అప్పుడప్పుడూ మాకింద పని చేసేవాళ్ళకీ ఓ.టీ.లివ్వకపోతే పని సాగద’ని స్టోర్స్, ఫైనాన్స్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు గోల పెడుతున్నారు. ఓ.టీ. లివ్వకపోతే టూర్లకి ప్రపోజల్స్ పంపిస్తారు! అప్పుడప్పుడూ ఓ.టీ. తగ్గించే ప్రయత్నాలు చెయ్యండి అని మాట వరుసకి హెచ్చరికగా మీరు ఓ.టి. కోసం పంపే ఫైళ్ళలో ఓ వాక్యం వ్రాయడం తప్ప, ఎవ్వరూ ఏమీ చెయ్యగలిగింది లేదు!” అన్నాడు సక్సేనా వేదాంత ధోరణిలో.

ఆయనగారి భార్యామణి డ్యూటీ చేసిన డ్రైవర్‌కి కంట్రోల్ రూం వాళ్ళు ఓ.టీ. సర్దుబాటు ఎలా చేస్తారోనని ఆలోచిస్తూ, రాజశేఖరం చిన్నగా నవ్వుకొంటూ తన గదికి వెళ్ళాడు.

చంపక్‌లాల్ రాజశేఖరం గదిలోకి వచ్చి, “శేఖర్‌సాబ్, ఎల్లుండి నుంచి పది రోజులు సెలవు మీద వెడ్తున్నాను. మా పెద్ద కుర్రవాడి వివాహం జరగబోతోంది. ఈ నెల 20 శనివారం సాయంత్రం చిన్న విందు ఏర్పాటు చేస్తున్నాను. మీరు కుటుంబంతో సహా ఆ విందుకి రావాలి” అని శుభలేఖ చేతికి అందించాడు.

రాజశేఖరం సతీసమేతంగా ఆ విందుకి వెళ్ళాడు. అనసూయ కాస్త నసుగుతూనే వెళ్ళింది. చంపక్‌లాల్ దంపతులు యిద్దర్నీ సాదరంగా ఆహ్వానించి, ఎంతో మన్నన చేసి కూర్చోబెట్టారు. చంపక్‌లాల్ నూతన వధూవరుల్ని పరిచయం చేశాడు.

“శేఖర్ సాబ్! భగవంతుడి దయ వల్ల మా వాడు యింజనీరింగ్ పాసయిన వెంటనే

ఉద్యోగం దొరికింది. గత నాలుగు నెలలుగా ఉద్యోగం చేస్తున్నాడు!" – అతని మాటల్లో కించిత్ గర్వం తొంగి చూసింది.

"చాలా సంతోషం చంపక్‌లాల్! యింతకాలమూ చెప్పలేదేం? చదువుల పట్ల నువ్వు తీసుకొన్న శ్రద్ధకి అభినందించక తప్పదు. మిగతా పిల్లలేం చదువుతున్నారు?" రాజశేఖరం ప్రశ్నించాడు.

"ఏదో మీ అందరి ఆశీర్వచన బలం సార్! మా పెద్దమ్మాయి మెడిసిన్ మొదటి సంవత్సరంలో జేరింది. రెండో కుర్రాడు ట్వెల్త్. రెండో అమ్మాయి టెన్త్" అన్నాడు చంపక్‌లాల్.

చంపక్‌లాల్ భార్య శీతల పానీయాలు తీసుకురావడానికి వెళ్ళింది. రాజశేఖరం అనసూయ వైపు క్రీగంట చూశాడు. ఆమె వందనంలో కొద్దిగా రంగులు మారాయి – పదో క్లాసు అత్తెసరు మార్కులతో పాసయిన కూతురు ఆమె మదిలో మెదలడంతో.

"సతీష్! ఏ కంపెనీలో పన్జేస్తున్నావ్? అన్నట్లు దీని మాటే మరిచాను!" అంటూ, రాజశేఖరం ఓ కవర్ని సతీష్‌కి అందించాడు.

"థాంక్స్, అంకుల్! విశ్రామ్ యిండస్ట్రియల్ కార్పొరేషన్‌లో ఎలక్ట్రిక్ టైప్‌రైటర్‌ల విభాగంలో జూనియర్ ఇంజనీర్‌గా పన్జేస్తున్నాను" అన్నాడు చంపక్‌లాల్ కొడుకు సతీష్.

"ఆఁహా, అలాగా? నెలసరి ఉత్పత్తి ఎంత? ఎసెంబ్లీ లైన్‌లో ఎంతమంది పన్జేస్తున్నారు?" – రాజశేఖరం కుతూహలంగా ప్రశ్నించాడు.

"ఎసెంబ్లీ లైన్‌లో యిరవై మంది పనిచేస్తున్నారు. పది మంది స్త్రీలు, పది మంది పురుషులు. మా మంత్లీ టార్గెట్ ప్రొడక్షన్ ఆరు వందలు."

"టార్గెట్ ఉత్పత్తి సమయానికి పూర్తి అవుతుందా?" – రాజశేఖరంయథాలాపంగా ప్రశ్నించాడు.

"ఏం చెప్పను అంకుల్? ఎసెంబ్లీ లైన్లో పనిచేసేవాళ్ళు, ప్రాణాలు తోడేస్తున్నారు. ఆడవాళ్ళందరూ సైరన్ యింకా అరగంట ఉందనగానే లేచిపోతారు. గట్టిగా అదమాయిస్తే లేనిపోని గొడవలు లేవదీస్తారు. వాళ్ళూ, మిగిలిన మగాళ్ళూ చేసే పని జాప్యం వల్ల కొంతమందిని ఓ.టీ.లో ఉంచక తప్పదు. మేనేజ్‌మెంట్ కఁయ్ మంటూ లేచి సవాలక్ష ప్రశ్నలడుగుతుంది. అటూ చెప్పలేక, యిటూ చెప్పలేక మాలాంటి వాళ్ళు మధ్యన నలిగిపోవల్సిందే!"

పెదవుల మధ్యన వచ్చే చిరునవ్వుని బలవంతంగా ఆపుకొంటూ, రాజశేఖరం చంపక్‌లాల్ వైపు చూశాడు.

"మీరు మాట్లాడుకొంటూ ఉండండి. ఓసారి అతిథుల్ని పలకరించి వస్తాను" అంటూ చంపక్‌లాల్ అక్కణ్ణుంచి జారుకొన్నాడు.

చంపక్‌లాల్ డ్యూటీలో తిరిగి జేరిన రోజున, రాజశేఖరానికి ప్లాంట్ నెంబరు పదహారుకి

వెళ్ళవలసి వచ్చింది. స్టెనో ద్వారా కబురందుకొని చంపక్‌లాల్ రాజశేఖరం గదిలో అడుగుపెట్టాడు.

"సాబ్, ప్లాంట్‌కి వెళ్ళాలన్నారటకదా. బండి హారన్ మ్రోగటల్లేదు. వెనుక వైపు కుడి చక్రంలో బ్రేక్ బాండ్ పట్టివేస్తోంది. యింకా.."

"చాలు చంపక్‌లాల్! యింకా నీ ముగ్గురి సంతానానికి మంచి చదువులు చెప్పించాలి కదా? వెళ్లి బండి బాగుచేయించుకొనిరా!" అన్నాడు రాజశేఖరం నవ్వుతూ.

"సార్, మీ మాటల్లోని వ్యంగ్యం తెలుస్తోనే ఉంది. చనువు తీసుకొని రెండు మాటలు చెపుతాను - తప్పు పట్టకండి. ఈ ఆఫీసులో మీరన్నా, అశోక్ నందా సాబ్ అన్నా మా కందరికీ చాలా గౌరవం. ఎందుకంటే, మీరు బళ్ళని స్వంత పనులకి వాడుకోరు కనక! కానీ మీ మంచితనం మాకు యిబ్బందిని కలిగిస్తుంది. మాలో కూడా వచ్చిందంతా వ్యసనాల మీద వెచ్చించే వాళ్ళూ వున్నారు, పిల్లల భవిష్యత్ కోసం ఏవో నాలుగు రాళ్ళు అదనంగా సంపాదించుకొనే నాలాంటి వాళ్ళు ఉన్నారు. అదనపు డ్యూటీ నిజంగా చేస్తేనే కాని మీలాంటి వాళ్ళు ఓ.టీ. యివ్వరు! అందుకోసం మాలాంటి వాళ్ళం మిమ్మల్ని యిబ్బంది పెట్టక తప్పదు! మీకు తెలియదేమో కాని సార్, నేను సెలవు పెట్టిన రోజు పది రోజుల్లోనూ, మీ డ్యూటీ చేసిన ఆరిఫ్‌ఖాన్‌ని కంట్రోల్ రూం వాళ్ళు ఎంతో బలవంతం మీద ఒప్పించారు!

"నిజానికి మీరు ఆ విందు రోజు సాయంత్రం మాపెద్దాడి మాటలు విన్న తర్వాత నా వైపు విసిరిన చూపు, నన్ను సిగ్గుతో కుచించుకుపోయినట్టు చేసింది. కాని ఏం చేసేది? నా పెద్ద కొడుకు వాళ్ళ కంపెనీ క్వార్టర్లో వేరు కాపురం పెట్టేశాడు. వాడి దగ్గర్నుంచి నేను ఏమీ ఆశించడంలేదు. నా పాట్లు నేను పడక తప్పదు. మీరన్నట్టుగా మిగిలిన ముగ్గురికీ మంచి చదువులు చెప్పించాలి కదా? నిజంగానే బండి బాగోలేదు. బాగు చేయించి తీసుకు వస్తాను" - చంపక్‌లాల్ ముగించి, రాజశేఖరం సమాధానం కోసం చూడకుండా వెళ్ళిపోయాడు.

ఆ మర్నాటి నుంచీ చంపక్‌లాల్ మరో ఆఫీసరు దగ్గర డ్యూటీ వేయించుకొన్నాడు. ట్రాన్స్‌పోర్ట్ యిన్‌ఛార్జి, రాజశేఖరం డ్యూటీ కోసం మరో డ్రైవర్ని ఎలా ఏర్పాటు చెయ్యాలా అని తల పట్టుకొని కూర్చున్నాడు!

సంగతి తెలిసిన రాజశేఖరం తనని తాను బేరీజు వేసుకోసాగాడు. అన్యమనస్కంగా ముందున్న టెక్నికల్ రిపోర్ట్ తెరిచాడు. మొదటి పేజిలోంచి అనసూయ మొహంపైకొచ్చి తనని వెక్కిరిస్తోంది.

విలువలనేవి చీమలు చేరే పంచదార పలుకుల్లా ఉండాలి కాని మంచి ముత్యాల్లా కాదు!'